సాక్షి
అనకాపల్లి
శనివారం : 16 : ఆగస్టు : 2025





కడలి గర్భంలో త్రివర్ణ రెపరెపలు!

79వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా రుషికొండ బీచ్ వద్ద శుక్రవారం జాతీయ జెండా రెపరెపలాడింది. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సహకారంతో లివ్ ఇన్ అడ్వంచర్స్ ఆధ్వర్యంలో సముద్ర గర్భంలో జాతీయ జెండాను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లివ్ ఇన్ వ్యవస్థాపకుడు బి.బలరామనాయుడు మాట్లాడుతూ ఎనిమిదిమంది డైవర్ల ఆధ్వర్యంలో కడలి గర్భంలో మన దేశ స్వాతంత్య్ర దినోత్సవాన్ని నిర్వహించడం దేశ భక్తికి హద్దుల్లేవన్న సంగతి గుర్తు చేసిందన్నారు.

- కొమ్మాది

## న్యూస్‌రీల్

### హరేకృష్ణ వైకుంఠంలో కృష్ణాష్టమి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో ఉన్న శ్రీరాధాకృష్ణులకు పూజలు చేస్తున్న భక్తులు

**తగరపువలస:** గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠం వద్ద హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరగనున్న శ్రీకృష్ణాష్టమి వేడుకలు శుక్రవారం ప్రారంభించారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు నిష్కించిన భక్తదాస ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు బాల గోపాలునికి ఉయ్యాలసేవతో ఉత్సవాలు నిర్వహించారు. శ్రీరాధాకృష్ణుల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. శనివారం శ్రీకృష్ణ భగవానునికి మహాభిషేకాలు, మహా మంగళ హారతి ఇవ్వనున్నారు. మిగిలిన రెండు రోజుల పాటు యథావిధిగా ఉయ్యాల సేవ, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహించనున్నారు.

### ఉచిత బస్సుతో మహిళలకు ఆర్థిక ఆసరా

- హోం మంత్రి అనిత
- స్త్రీశక్తి పథకం ప్రారంభం



స్త్రీశక్తి ఉచిత బస్సు పథకాన్ని ప్రారంభిస్తున్న హోం మంత్రి అనిత

**అనకాపల్లి టౌన్:** ఉచిత బస్సు ప్రయాణం ద్వారా మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజీ ఆవరణలో స్త్రీశక్తి పేరుతో మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ఆమె ప్రారంభించారు. బస్సులో ప్రయాణించేటప్పుడు ఆధార్ కార్డు తప్పనిసరిగా చూపించాలన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించిన బస్సులో హోం మంత్రితోపాటు కలెక్టర్ విజయ్ కృష్ణన్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కొంతదూరం ప్రయాణించారు. జేసీ జాహ్నవి, జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి వి.ప్రవీణ, డీఎస్పీ శ్రావణి పాల్గొన్నారు.

**నర్సీపట్నంలో..**

**నర్సీపట్నం:** నర్సీపట్నం ఆర్టీసీ డిపోలో స్త్రీశక్తి పథకాన్ని డిపో మేనేజర్ ధీరజ్ శుక్రవారం సాయంత్రం జెండా ఊపి ప్రారంభించారు. ఏఎంసీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, జెడ్పీటీసీ సుకల రమణమ్మ, ట్రాఫిక్ మేనేజర్ మోహన్‌రావు, కౌన్సిలర్లు చింతకాయల రాజేష్, శ్రీకాంత్, పాల్గొన్నారు.

# మహనీయుల అడుగుజాడల్లో..
# సమగ్ర పురోగతి దిశగా..

- పేదరికాన్ని నిర్మూలిద్దాం
- అన్ని రంగాల్లో ప్రగతి సాధిద్దాం
- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన హోం మంత్రి అనిత
- ఘనంగా స్వాతంత్య్ర దినోత్సవం
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రభుత్వ విభాగాల శకటాలు



తెలుగుతల్లి వేషధారణలో బాలిక

**సాక్షి, అనకాపల్లి:** ఎందరో దేశభక్తులు, మహనీయులు వీరోచిత పోరాటాలు, నిస్వార్థ త్యాగాలతో స్వేచ్ఛా భారతావనిని మనకు అందించారని, వారి ఆశయాల బాటలో పయనిద్దామని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. జిల్లా అన్ని రంగాల్లో సమగ్ర పురోగతి సాధించేలా కృషి చేద్దామని పేర్కొన్నారు. శుక్రవారం ఎన్టీఆర్ క్రీడా మైదానంలో 79వ స్వాతంత్య్ర దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన హోం మంత్రి జాతీయ పతాక ఆవిష్కరణ చేశారు. అనంతరం త్రివర్ణ పతాకానికి కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హాలతో కలిసి వందన సమర్పణ చేశారు. పరేడ్ కమాండర్ పి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసు దళం మంత్రికి సెల్యూట్ సమర్పించగా, పోలీస్ బ్యాండ్ బృందం జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా మూడు రంగుల బెలూన్లను గాలిలోకి ఎగురవేసి, పోలీస్ గౌరవ వందనాన్ని మంత్రి స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పీ4 కార్యక్రమం ద్వారా గుర్తించిన 53 వేల నిరుపేద కుటుంబాలను దాతల సాయంతో ఆదుకుంటామని చెప్పారు. జిల్లాలో 2.43 లక్షల మంది రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.161.45 కోట్లు అందించామన్నారు. దీపం–2 కింద మొదటి విడతలో 3.23 లక్షల మంది, రెండో విడతలో 3.4 లక్షల మందికి సబ్సిడీ అందించామన్నారు.

- ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో 2.7 లక్షల వేతనదారులకు రూ.234.7 కోట్ల ఉపాధి
- 2.58 లక్షల మందికి సామాజిక పింఛన్ల పంపిణీ
- 23 గిరిజన గ్రామలకు రూ.125.08 కోట్లతో 23.13 కి.మీ రహదారులనిర్మాణం
- అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 15,462 మంది గర్భిణులు, బాలింతలకు, 51,593 మంది పిల్లలకు రూ.96 కోట్లతో పోషకాహారం
- బీసీ కార్పొరేషన్ ద్వారా 2265 మందికి మహిళలకు 19 సెంటర్ల ద్వారా కుట్టుమిషన్ శిక్షణ
- ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా 4331 మంది ఆరోగ్యశ్రీ సేవలకు రూ.8.37 కోట్ల చెల్లింపు
- పంచాయతీరాజ్ శాఖలో 1734 సీసీ రోడ్లు మంజూరు కాగా 1371 రోడ్లు పూర్తి
- పీఎం ఆవాస్ యోజన పథకంలో 62,498 ఇళ్లకు గానూ 32,823 ఇళ్ల నిర్మాణం పూర్తి
- రూ.45 కోట్లతో 130 భారీ, మెగా తరహా పరిశ్రమల స్థాపన
- నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా జిల్లాలో 3,257 మంది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు



పోలీసు దళాల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న హోం మంత్రి అనిత

### డీఆర్‌డీఏ శకటానికి ప్రథమ బహుమతి

సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలపై ప్రభుత్వ శాఖలు రూపొందించిన శకటాలను ఈ సందర్భంగా ప్రదర్శించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ (డీఆర్‌డీఏ) శకటం ప్రథమ బహుమతిని సొంతం చేసుకోగా, జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) శకటం ద్వితీయ బహుమతి, రవాణా, పరిశ్రమలు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖలు మూడో బహుమతి సొంతం చేసుకున్నాయి. విద్యుత్, పట్టు పరిశ్రమ, విద్య, భూగర్భ గనులు, వైద్య ఆరోగ్యం, వ్యవసాయ శాఖలు, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం, జిల్లా క్రీడా సాధికార సంస్థ, నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థ స్టాళ్లు ఏర్పాటు చేశారు.

**అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు**

వివిధ పాఠశాలలకు చెందిన 11 విద్యార్థి బృందాలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించాయి. వందేమాతరం గీతంతో మాతా శిశు సంక్షేమ శాఖ, చిల్డ్రన్‌హోంకు చెందిన చిన్నారులు ప్రదర్శన ప్రారంభించారు. నర్సీపట్నంలోని మాతా శిశు సంక్షేమ శాఖ చిల్డ్రన్ హోమ్ చిన్నారుల బృందానికి మొదటి బహుమతి, అచ్యుతాపురం కేజీబీవీ పాఠశాల విద్యార్థులకు రెండో బహుమతి, కశింకోట ఐడబ్ల్యూహెచ్‌సీ బాలికల పాఠశాల విద్యార్థులకు మూడో బహుమతి లభించాయి. అన్ని ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

**422 మంది ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు**

జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ సేవలందించిన 422 మంది అధికారులు, ఉద్యోగులు, పోలీసులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కలెక్టర్, జేసీ, ఎస్పీలతో కలిసి హోం మంత్రి అనిత వాటిని ప్రదానం చేశారు.

ఈ కార్యక్రమంలో జేసీ ఎం.జాహ్నవి, డీఆర్వో వై.సత్యనారాయణరావు, అనకాపల్లి, నర్సీపట్నం ఆర్డీవోలు షేక్ ఆయిషా, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, వి.వి.రమణ, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు బత్తుల తాతయ్యబాబు, మళ్ల సురేంద్ర, పీలా గోవింద సత్యనారాయణ, డీసీఎంఎస్ చైర్మన్ కె.బాలాజీ, జిల్లా అధికారులు, పోలీస్ అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.



జాతీయ జెండాకు వందనం సమర్పిస్తున్న హోం మంత్రి వంగలపూడి అనిత, చిత్రంలో కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా



ఐడబ్ల్యూహెచ్‌సీ బాలికల వసతిగృహం (కశింకోట) విద్యార్థినుల థింసా నృత్యం





మొదటి బహుమతి పొందిన డీఆర్‌డీఏ శకటం





అలరించిన విద్యార్థుల విన్యాసం

### ఇద్దరు ఎక్సైజ్ సీఐలకు రాష్ట్ర పురస్కారం

**యలమంచిలి రూరల్/పాయకరావుపేట:** విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ, విశిష్ట సేవలందించిన యలమంచిలి ఎక్సైజ్ సీఐ పి.తేజో వెంకట కుమార్, పాయకరావుపేట ఎక్సైజ్ సీఐ జి.శ్రీనివాసరావులకు స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర పురస్కారం లభించింది. శుక్రవారం మంగళగిరిలో రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్ కుమార్, ఎక్సైజ్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ నుంచి వీరు ప్రశంసాపత్రం అందుకున్నారు.



ప్రశంసా పత్రం అందుకుంటున్న యలమంచిలి, పాయకరావుపేట ఎక్సైజ్ సీఐలు తేజో వెంకటకుమార్, శ్రీనివాసరావు

### పెట్టుగోళ్లపల్లి సర్పంచ్‌కు జాతీయ అవార్డు

**ఎస్.రాయవరం:** ఉత్తమ గ్రామ సర్పంచ్‌గా ఎంపికయిన పెట్టుగోళ్లపల్లి సర్పంచ్ అల్లు వెంకటప్రశాంతికి ఢిల్లీలో అరుదైన గౌరవం దక్కింది. స్వాతంత్య్ర వేడుకల్లో కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్‌సింగ్ చేతుల మీదుగా ఆమె పురస్కారం అందుకున్నారు. ఆమెను మండల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, పెట్టుగోళ్లపల్లి గ్రామస్తులు అభినందించారు.



కేంద్ర మంత్రితో అవార్డు గ్రహీత సర్పంచ్ వెంకట ప్రశాంతి

## దొంగ ఓట్లతో గెలిచి సంబరాలా?

- జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ప్రజాస్వామ్యం ఖూనీ
- మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ధ్వజం



**దేవరాపల్లి:** వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల, ఒంటిమెట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో దొంగ ఓట్లతో గెలిచి, టీడీపీ నాయకులు సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటని వైఎస్సార్‌సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు, మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు విమర్శించారు. తారువలో శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. అడుగడుగునా అధికారాన్ని అడ్డం పెట్టుకొని పట్టపగలే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారన్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించాల్సిన పోలీస్, పోలింగ్ అధికార్లు అధికార పార్టీతో కుమ్మక్కయ్యారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ సానుభూతి ఓటర్ల స్లిప్‌లను లాక్కొని పోలింగ్ కేంద్రాలకు వెళ్లకుండా అడ్డుకొన్నారని, వైఎస్సార్‌సీపీ పోలింగ్ ఏజెంట్లపై దాడి చేసి పోలింగ్ కేంద్రాలను నుంచి వెళ్లగొట్టారని ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ అవినాష్‌రెడ్డి సహా ఇతర నాయకులుందర్నీ హౌస్ అరెస్టు చేసి అన్ని పోలింగ్ కేంద్రాలను హస్తగతం చేసుకొని రిగ్గింగ్‌కు పాల్పడ్డారని ఆరోపించారు. ఎన్నికల జరిగే ప్రాంతంలోని వారితో కాకుండా ఇతర నియోజకవర్గాల నుంచి రప్పించిన టీడీపీ నాయకులు దొంగ ఓట్లు వేశారని, ప్రభుత్వం విడుదల చేసిన వీడియోలు, ఫోటోలే ఇందుకు నిదర్శనమన్నారు. ఎన్నికల్లో అక్రమాలపై వైఎస్సార్‌సీపీ అధినేత వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అన్ని ఆధారాలు, సాక్ష్యాలను బయటపెట్టినా ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. అధికార టీడీపీకి అంత ప్రజాబలం ఉంటే ఇంతగా బరితెగించి దౌర్జన్యం చేయాల్సిన అవసరం ఎందుకొచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఉప ఎన్నికను రద్దు చేసి కేంద్ర బలగాల సమక్షంలో ఎన్నికలు నిర్వహించాలని మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు డిమాండ్ చేశారు.

# దొంగతనం కేసులో ఇరికించారని యువకుడి ఆత్మహత్య

- మూడు నెలల క్రితం చోరీ కేసులో అరెస్ట్
- బెయిల్‌పై వచ్చాక ఈనెల 4న గడ్డి మందు తాగడంతో అస్వస్థత
- తన దుస్థితికి ఇద్దరు గ్రామస్తులు, ఇద్దరు పోలీసులే కారణమని నోట్
- బాధితుడి మృతితో బుచ్చెయ్యపేట స్టేషన్ ముట్టడికి కుటుంబ సభ్యుల యత్నం
- అడ్డుకున్న పోలీసులు.. బుచ్చెయ్యపేటలో తీవ్ర ఉద్రిక్తత



కేజీహెచ్‌లో తన చావుకు కారణమైన వారి వివరాలతో నోట్ రాస్తున్న కృష్ణమూర్తి (ఫైల్)

**బుచ్చెయ్యపేట:** దొంగతనం కేసులో తనను అన్యాయంగా ఇరికించారన్న మనస్తాపంతో గడ్డి మందు తాగిన అయితంపూడికి చెందిన ముచ్చకర్ల కృష్ణమూర్తి (22) పదకొండు రోజులపాటు మృత్యువుతో పోరాడి శుక్రవారం తుదిశ్వాస విడిచాడు. ఆ అభాగ్యుడి మృతితో గుండె మండిన కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేసేందుకు యత్నించగా పోలీసులు మధ్యలోనే అడ్డుకున్నారు. దాంతో వారు అక్కడే బైఠాయించి ఆందోళన చేస్తున్నారు. వివరాలు.. మూడు నెలల కిందట బుచ్చెయ్యపేట మండలం అయితంపూడి గ్రామంలో జరిగిన దొంగతనం కేసులో అనుమానితుడైన అయితరెడ్డి శివకుమార్‌తోపాటు మృతుడు ముచ్చకర్ల కృష్ణమూర్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వీరిద్దరూ నేరం అంగీకరించినట్టు పోలీసుల కథనం. చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని పోలీసులు శివకుమార్, కృష్ణమూర్తిని రిమాండ్‌కు తరలించారు. బెయిల్‌పై వచ్చిన కృష్ణమూర్తి ఈనెల 4వ తేదీన గడ్డి మందు తాగి విశాఖ కేజీహెచ్‌లో అప్పటి నుంచి చికిత్స పొందుతున్నాడు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతుండగానే.. తాను దొంగతనం చేయలేదని, అనవసరంగా తనను కేసులో ఇరికించారని, ఇందుకు గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు, ఇద్దరు బుచ్చెయ్యపేట పోలీసులే కారణమని నోట్ రాశాడు.





బుచ్చెయ్యపేటలో పోలీసులు అడ్డుకోవడంతో రోడ్డుపై బైఠాయించిన కృష్ణమూర్తి కుటుంబ సభ్యులు

**యువకుడి మరణంతో ఉద్రిక్తత**

కృష్ణమూర్తి శుక్రవారం కేజీహెచ్‌లో మరణించడంతో.. తన కుమారుడి చావుకు కారణమైన పోలీసులపైన, దొంగతనం కేసులో ఇరికించిన వారిపై చర్యలు తీసుకోవాలని కృష్ణమూర్తి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు బుచ్చెయ్యపేట పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేయడానికి యత్నించారు. పోలీసులు వీరిని మధ్యలోనే అడ్డుకున్నారు. కృష్ణమూర్తి కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌కు రాకుండా సుమారు 50 మంది పోలీసులు బారికేడ్లతో వీరిని అడ్డుకున్నారు. దీంతో కృష్ణమూర్తి తల్లిదండ్రులు ముచ్చకర్ల మహాలక్ష్మి, మంగమ్మ, అన్నయ్య సత్యనారాయణమూర్తి, ఇతర కుటుంబ సభ్యులు రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. కృష్ణమూర్తి చావుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని, న్యాయం జరిగే వరకు ఇక్కడ నుంచి వెళ్లేది లేదని నినాదాలు చేశారు.

**మృతదేహం అడ్డగింత**

కృష్ణమూర్తి భౌతిక కాయానికి పోస్టుమార్టం నిర్వహించి సాయంత్రం 6 గంటల ప్రాంతంలో విశాఖ కేజీహెచ్ నుంచి వ్యానులో బయలుదేరారు. కృష్ణమూర్తి మృతదేహాన్ని అయితంపూడి తీసుకురాకుండా బుచ్చెయ్యపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించి న్యాయం జరిగే వరకు ఆందోళన చేయడానికి నిర్ణయించి రాత్రి 7 గంటలకే బుచ్చెయ్యపేటకు మృతుని కుటుంబ సభ్యులు చేరుకున్నారు. స్టేషన్‌కు వెళ్లకుండా వారిని బారికేడ్లతో పోలీసులు అడ్డుకోవడంతో మృతుని కుటుంబ సభ్యులు తీవ్ర ఆగ్రహం చెందారు. మృతుని కుటుంబ సభ్యులు, పోలీసుల మధ్య తోపులాట జరగడంతో బుచ్చెయ్యపేటలో ఉద్రిక్తత ఏర్పడింది. పోలీసులు కృష్ణమూర్తి మృతదేహం ఉన్న వ్యాను బుచ్చెయ్యపేట రాకుండా రాజాం మీదుగా పెదమదీన నుంచి అయితంపూడి గ్రామానికి పంపించారు. అయితంపూడి గ్రామంలోకి రాకుండా పైడంపేట వద్దే కృష్ణమూర్తి మృతదేహం ఉన్న వ్యానును కుటుంబ సభ్యులు అడ్డుకుని బుచ్చెయ్యపేట తరలించడానికి ప్రయత్నించారు. పోలీసులు మాత్రం కృష్ణమూర్తి మృతదేహాన్ని బుచ్చెయ్యపేట వెళ్లకుండా అడ్డుకోవడంతో అర్ధరాత్రి కడపటి వార్తలు అందే వరకు ఉద్రిక్తత కొనసాగుతూనే ఉంది.

### శ్రావణ లక్ష్మికి కుంకుమ పూజ

ఉత్తరాంధ్రుల ఇలవేల్పు గవరపాలెం నూకాంబిక అమ్మవారి బాలాలయంలో శ్రావణ మాసం నాలుగో శుక్రవారం సందర్భంగా అమ్మవారిని గాజులతో అలంకరించారు. అమ్మవారి మండపంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ కె.ఎల్.సుధారాణి, మాజీ ఆలయ చైర్మన్ పీలా నాగశ్రీను, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

-అనకాపల్లి



నూకాంబికకు గాజులతో అలంకరణ



ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

# ఉత్తమ ఉద్యోగులకు అవార్డులు















**తుమ్మపాల:** ఉత్తమ సేవలందించిన పలువురు అధికారులు, సిబ్బందికి అనకాపల్లిలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో మంత్రి వంగలపూడి అనిత, కలెక్టర్ విజయకృష్ణన్ పురస్కారాలు అందజేశారు.










**హోంమంత్రి వంగలపూడి అనిత చేతుల మీదుగా జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి,ఎస్పీ తుహిన్ సిన్హా, డీఆర్వో వై.సత్యనారాయణరావు, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, నర్సీపట్నం ఆర్డీవో వి.వి.రమణ, అనకాపల్లి ఆర్డీవో షేక్ ఆయిషా, పౌర సంబంధాల శాఖ పీఆర్వో ఆర్.షణ్ముఖ రావు, ప్రకృతి వ్యవసాయం జిల్లా అధికారి లచ్చన్న, నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసపరావు , పీజీఆర్ఎస్ విభాగం ఎస్ఐ కె.శిరీష, డీఆర్వో పేషీ ఓఎస్ శివాజీ, జిల్లా రిజిస్ట్రార్ మన్మథరావు, డ్వామా పీడీ పూర్ణిమాదేవి, పరేడ్ కమాండర్ పి.నాగేశ్వరరావు, రవాణా శాఖ జిల్లా అధికారి మనోహర్. పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారి మూర్తి, సివిల్ సప్లయ్ మేనేజర్ జయంతి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.మనోరమ,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్వీఎస్ సుబ్బలక్ష్మి,నక్కపల్లి ప్రభుత్వ ఆస్పత్రి జనరల్ డ్యూటీ అటెండర్ వి.కిరణ్, జిల్లా ఇరిగేషన్ ఎస్ఈ త్రినాథ్ తదితరులు అవార్డు అందుకున్నారు.**



జాతీయ జెండాను ఎగురవేస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

# త్రివర్ణ శోభితం

**జిల్లాలో పలు ప్రభుత్వ, ప్రైవేట్, రాజకీయపార్టీల కార్యాలయాల్లో స్వాతంత్ర్య దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జాతీయజెండాను ఆవిష్కరించి, స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకున్నారు.**

**అనకాపల్లి:** స్థానిక మెయిన్‌రోడ్డులో గల న్యాయస్థానాల ఆవరణలో జిల్లా పదో అదనపు న్యాయమూర్తి నరేష్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. న్యాయమూర్తులు నాగేశ్వరరావు, రామకృష్ణ, ధర్మారావు, రమేష్, విజయలక్ష్మి, నిఖితా సెంగర్, బార్‌అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ తుహిన్ సిన్హా, ఆయన సతీమణి, 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి నిఖితా సెంగర్‌లు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలన్నారు. అనంతరం పోలీస్ సిబ్బందికి ఎస్పీ తుహిన్ సిన్హా మిఠాయిలు పంపిణీ చేశారు. అదనపు ఎస్పీలు ఎ.దేవప్రసాద్, ఎల్.మోహనరావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

**తుమ్మపాల:** కలెక్టరేట్‌లో కలెక్టర్ విజయ కృష్ణన్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, గౌరవ వందనం సమర్పించారు. జేసీ ఎం.జాహ్నవి, డీఆర్వో వై.సత్యనారాయణరావు పాల్గొన్నారు.

**బాపూజీ బాటలో నడవాలి**

**అనకాపల్లి టౌన్:** వైఎస్సార్ సీపీ జిల్లా ఆఫీస్‌లో 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాపూజీ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. రాజ్యాంగం మనకిచ్చిన ఓటు హక్కును ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనలో వినియోగించుకోలేకపోతున్నామని చెప్పారు. అందుకు నిదర్శనం ఇటీవల జరిగిన ఎన్నికలేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్లమెంట్ పరిశీలకుడు కరణం ధర్మశ్రీ, ఎంపీపీ గొర్లి సూరిబాబు, రాష్ట్ర కార్యదర్శులు దంతులూరి దిలీప్ కుమార్, బొడ్డేడ ప్రసాద్, నియోజకర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, 80,84 వ వార్డుల ఇన్‌చార్జులు కె.ఎం. నాయుడు, కోరుకొండ రాఘవ, పార్టీ మండల అధ్యక్షుడు పెద్దిశెట్టి గోవింద్, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు వేగి త్రినాథ్, పార్టీ సీనియర్ నాయకులు కొణతాల మురళీ కృష్ణ, బొడ్డేడ శివ, కె.ఎం. నాయుడు, గైపూరి రాజు, దాడి నారాయణ రావు, ఉగ్గిన అప్పారావు, జ్ఞానదీప్, సీటిపల్లి లక్ష్మి, నడిపల్లి శోభ, పద్మ పాల్గొన్నారు.



జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా దంపతులు



వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్



అవార్డులతో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు



జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో యోగా ప్రదర్శన



సాంస్కృతిక ప్రదర్శనల్లో మొదటి బహుమతి అందుకుంటున్న నర్సీపట్నం బాలసదన్ విద్యార్థులు, ఐసీడీఎస్ అధికారులు




ఏజీఎస్‌వీఎం పాఠశాల (లేమర్తి) విద్యార్థుల తెలుగుతల్లి నృత్యప్రదర్శన



జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో యోగా ప్రదర్శన



## ఐపీఎస్ అధికారి సత్యనారాయణకు రాష్ట్రపతి మెడల్



కిల్లాడ సత్యనారాయణ

**నక్కపల్లి:** కోటవురట్ల మండలం పాములవాక గ్రామానికి చెందిన ఐపీఎస్ అధికారి కిల్లాడ సత్యనారాయణ అత్యంత ప్రతిష్టాత్మకమైన రాష్ట్రపతి మెడల్‌కు ఎంపికయ్యారు. శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ఈ విషయం ప్రకటించింది. ఈ మెడల్‌ను రిపబ్లిక్‌డే రోజున రాష్ట్రపతి ప్రదానం చేస్తారు. సత్యనారాయణ 1998 ఉత్తరప్రదేశ్ కేడర్ నుంచి ఆగ్రా ఏఎస్పీగా తొలి పోస్టింగ్ దక్కించుకున్నారు. ప్రస్తుతం లక్నోలో అడిషనల్ డైరెక్టర్ జనరల్ హోదాలో పనిచేస్తున్నారు.

## పెద్దేరుకు వరద పోటు



ప్రమాద స్థాయికి చేరుకుంటున్న పెద్దేరు జలాశయం నీటి మట్టం

**మాడుగుల:** మండలంలో అధికంగా జలవనరులున్న పెద్దేరు జలాశయం కేచ్‌మెంట్ ఏరియాలో గత రెండు రోజులుగా అత్యధికంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో జలాశయానికి శుక్రవారం ఉదయం నుంచి వరద నీరు పోటెత్తుతోంది. 800 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరడంతో అప్రమత్తమైన జలాశయం అధికారులు 600 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. జలాశయం గరిష్ట నీటిమట్టం 137 మీటర్లు కాగా, ప్రస్తుతం 136. 45 మీటర్లకు చేరుకుంది.

**అప్రమత్తంగా ఉండాలి**

పెద్దేరు ఏటిబాధిత గ్రామాలైన డి. గొటివాడ, సత్యవరం, జేడీపేట, వీరవల్లి, జంపెన, గొటివాడ అగ్రహారం, ఓడపాడు గ్రామాలకు చెందిన రైతులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రమాదేవి సూచించారు. పెద్దేరు జలాశయానికి వరద ఎక్కువగా వచ్చి చేరుతోందని చెప్పారు. దీంతో జలాశయం నుంచి దిగువకు నీటిని విడిచిపెడుతున్నారని తెలిపారు. రాత్రి పూట రైతులతో పాటు పశువుల కాపరులు పెద్దేరు నదిలో దిగరాదన్నారు. ఇప్పటికే ఆయా గ్రామాలకు చెందిన వీఆర్వోలకు సమాచారం అందజేసినట్టు చెప్పారు.

## వివాహిత ఆత్మహత్య



సుశీల(ఫైల్)

**మునగపాక:** మండలంలోని చూచుకొండ గ్రామానికి చెందిన వివాహిత సుశీల (35)శుక్రవారం ఆత్మహత్య చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్ఐ ప్రసాదరావు విలేకరులకు తెలిపారు. చూచుకొండ గ్రామానికి చెందిన ఆడారి సూరి నాగేశ్వరరావు,సుశీల దంపతులు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. సుశీల మానసిక స్థితి కొంతకాలంగా సరిగా లేకపోవడంతో కుటుంబ సభ్యులు తరచూ ఆస్పత్రికి తీసుకువెళ్లి వైద్యం చేయిస్తున్నారు. కాగా శుక్రవారం తన కుమారుడితో కలిసి సుశీల పొలం పనులకు వెళ్లింది. పని పూర్తి కాగానే ఇంటికి వెళ్లిపోయింది. అనంతరం కొంతసేపటి తరువాత కుమారుడు ఇంటికి వెళ్లేసరికి సుశీల ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఉంది. స్థానికుల సాయంతో మృతదేహాన్ని కిందకు దించిన కుమారుడు, మునగపాక పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఎస్ఐ ప్రసాదరావు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని అనకాపల్లి వందపడకల ఆస్పత్రి తరలించారు.

## రెచ్చిపోతున్న గ్రావెల్ మాఫియా

- మెలిపాక జగన్నాథపురం వద్ద యథేచ్ఛగా తవ్వకాలు



మెలిపాక జగన్నాథపురంలో గ్రావెల్‌ను తవ్వేందుకు తీసుకొచ్చిన పొక్లెయినర్

**అచ్యుతాపురం రూరల్ :** మండలంలో గ్రావెల్ మాఫియా రెచ్చిపోతోంది. వరుస సెలవులు రావడంతో అధికారులు పట్టించుకోరనే ధీమాతో మెలిపాక జగన్నాథపురం వద్ద గల కొండను శుక్రవారం యథేచ్ఛగా తవ్వి, గ్రావెల్‌ను అక్రమంగా తరలించారు. అధికారులు స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాల్లో నిమగ్నమై ఉండగా గ్రావెల్ మాఫియా మండల శివారం గ్రామమైన మెలిపాక జగన్నాథపురం నుంచి గ్రావెల్‌ను అక్రమంగా తరలించింది. గ్రావెల్ తరలింపునకు ఏకంగా రోడ్డునే ఏర్పాటు చేశారు. జగన్నాథపురం, చూచుకొండ వెళ్లే రహదారి మధ్యలో రోడ్డు నుంచి కొండ వరకూ సుమారు 20 అడుగుల వెడల్పుతో రెండు కిలోమీటర్ల పొడవున రోడ్డును నిర్మించి, భారీ ఎత్తున గ్రావెల్‌ను తరలించారని స్థానికులు తెలిపారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి అక్రమార్కులకు అడ్డుకట్టవేయాలని వారు కోరారు.



గ్రావెల్‌ను తరలించేందుకు నిర్మించిన రోడ్డు

## పెన్సిల్ మొనపై శ్రీకృష్ణుడి రూపం



పెన్సిమొన మీద చెక్కిన శ్రీకృష్ణుడి రూపం

**మాడుగుల రూరల్:** శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని ఓ సూక్ష్మ కళాకారుడు కృష్ణుని రూపాన్ని తీర్చిదిద్దారు. మండలంలో ఎం. కోడూరు గ్రామానికి చెందిన నెయ్యిదొండ గోపాల్ ఐదు గంటలు శ్రమించి పెన్సిల్ మొనపై శ్రీకృష్ణుడి రూపాన్ని తయారు చేశారు. ఆయన సృజనాత్మకతను పలువురు అభినందించారు.

## రోడ్డు ప్రమాదంలో గునుపూడి యువకుడి మృతి



కుశరాజు(ఫైల్)

**నాతవరం:** మండలంలో గునుపూడి గ్రామానికి చెందిన పైల కుశరాజు(25) కర్నూలు జిల్లా ఆళ్లగడ్డ వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. పైల అప్పలనాయుడు, బుజ్జమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. డిగ్రీ చదివిన పెద్ద కొడుకు కుశరాజు కర్నూలు జిల్లా ఆళ్లగడ్డలో ఓ ప్రైవేటు కంపెనీలో ఆరు నెలల కిందట ఉద్యోగంలో చేరాడు. గురువారం కుశరాజు వేరే వ్యక్తితో కలిసి బైక్‌పై వస్తుండగా వ్యాన్ ఢీకొనడంతో మృతి చెందాడు. చేతికందివచ్చిన కుమారుడు మరణించడంతో తల్లిదండ్రులు బోరు విలపిస్తున్నారు. కుశరాజుకు సోదరుడు, సోదరి ఉన్నారు. సోదరికి ఇటీవల వివాహం జరిగింది.

## స్టాల్స్‌ను పట్టించుకోని హోం మంత్రి



ఎన్టీఆర్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన స్టాల్స్

**తుమ్మపాల:** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వివిధ శాఖల పనితీరు, కార్యాచరణను వివరిస్తూ స్టాల్స్‌ను ఏర్పాటు చేయడం ఆనవాయితీ. ముఖ్య అతిథి సందర్శించి, వారిని ప్రోత్సహిస్తారు. కానీ శుక్రవారం ఎన్టీఆర్ గ్రౌండ్‌లో జరిగిన వేడుకలో హోం మంత్రి వంగలపూడి అనిత స్టాల్స్‌ను సందర్శించకపోవడంతో నిర్వాహకులు నిరుత్సాహానికి గురయ్యారు. 14వ తేదీ రాత్రంతా తీవ్రంగా శ్రమించామని, తమ కష్టాన్ని గుర్తించలేదని అధికారులు, సిబ్బంది అసంతృప్తికి లోనయ్యారు.

# గుర్తు తెలియని మృతదేహం లభ్యం



అనకాపల్లి-ఆనందపురం హైవేను అనుకుని బోర్రమ్మ గెడ్డవద్ద లభ్యమైన గుర్తు తెలియని మృతదేహం

**సబ్బవరం:** మండలంలోని చిన్నయ్యపాలెం సమీపంలో అనకాపల్లి–ఆనందపురం హైవేను ఆనుకుని బోర్రమ్మగెడ్డ వద్ద గుర్తు తెలియని మృతదేహం లభ్యమయ్యింది. ముళ్ల పొదల్లో పడివున్న మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు 112కు ఫోన్ చేసి సమాచారం అందించారు. పెందుర్తి పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించి సబ్బవరం పరిధి కావడంతో సబ్బవరం పోలీసులకు సమాచారం అందించారు. సీఐ జి.రామచంద్రరావు, ఎస్ఐ దివ్య, సిబ్బందితో కలిసి వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. తుప్పల్లో పడి ఉన్న మృత దేహాన్ని గుర్తించి వెలికి తీయించారు. శరీరం బాగా ఉబ్బిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. సుమారు 40–45 ఏళ్ల వయసున్న మృతుడి శరీరంపై నిక్కరు, బనియన్, చేతికి రాగి కడియం ఉంది. మరణించి నాలుగైదు రోజులై ఉంటుందని సీఐ తెలిపారు. ఒక బిచ్చగాడు వారం రోజుల క్రితం ఈ ప్రాంతంలో సంచరించేవాడని, ప్రస్తుతం కనిపించడం లేదని స్థానికులు చెబుతున్నారు. మృతుడు ఆ బిచ్చగాడేనన్న అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి పోస్ట్‌మార్టం నిమిత్తం తరలించినట్లు సీఐ తెలిపారు.

# రంగస్థల కళాకారుడికి సన్మానం



రంగస్థల నటుడు, దర్శకుడు ముసిలినాయుడును సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు కరణం ధర్మశ్రీ, బొడ్డేడ ప్రసాద్

**మునగపాక:** గ్రామీణ యువజన మందిరం వార్షికోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న ఉమ్మడి విశాఖ జిల్లా ఆహ్వాన నాటిక పోటీల్లో రెండో రోజైన శుక్రవారం రంగస్థల నటుడు, దర్శకుడు ముసిలినాయుడును ఘనంగా సన్మానించారు. మునగపాక నందీశ్వర కళా ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ పాల్గొన్నారు. కళారంగానికి ముసిలినాయుడు అందించిన సేవలను కొనియాడారు. అంతకముందు జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ మాట్లాడుతూ.. మునగపాకలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి అవసరమయ్యే నిధుల మంజూరుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, గ్రామీణ యువజన మందిరం అధ్యక్షుడు ఆడారి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### యూత్ క్లబ్ కార్యవర్గం ఎన్నిక

కశింకోట: మండలంలోని బయ్యవరంలో సన్నీ యూత్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మామిడి నాయుడు, ఉపాధ్యక్షుడిగా చిదిరెడ్డి రాజు, ప్రధాన కార్యదర్శిగా జి. ప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా టి. భాను, కోశాధికారి, సమన్వయకర్తగా కె. వెంకటేష్, కార్యవర్గ సభ్యులుగా అల్లక అప్పారావు, పల్లెల సింహాచలం ఎన్నికయ్యారు.

### వైభవంగా గౌరీపరమేశ్వరుల ఊంజల్ సేవ



గౌరీపరమేశ్వరుల ఊంజల్ సేవా కార్యక్రమంలో భక్తులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం గౌరీ పంచాయతన దేవస్థానంలో గౌరీ పరమేశ్వరుల 207వ ఊంజల్ సేవ కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు అంపోలు గోపాల కృష్ణశర్మ, శేషులు వేద మంత్రాలతో ఈ కార్యక్రమాన్ని వ్యాపారవేత్త కొణతాల జగన్నాథనాయుడు జగదీశ్వరి దంపతులతో నిర్వహించారు. ఆలయ మండపంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన గాయకుడు గురజాడ మధుసూదన్ అన్నమయ్య కీర్తనలు భక్తులను రంజింపచేశాయి. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కర్రి సన్యాసి నాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, సభ్యులు ఆళ్ల మహాలక్ష్మీ నాయుడు, మళ్ల సురేష్, ఆళ్ల ప్రసాద్, గౌరీ గీత మహిళా మండలి ప్రతినిధి పెతకంశెట్టి సుజాత పాల్గొన్నారు.

### సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు

కశింకోట: స్థానిక ఆర్టీసీ బస్సు స్టేషన్‌లో రూ.20 లక్షలు జెడ్పీ నిధులతో నిర్మించే సిమెంట్ రోడ్డు పనులకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు శుక్రవారం భూమిపూజ చేసి ప్రారంభించారు. స్టేషన్‌లో ప్రయాణికుల ఇబ్బందులు తొలగడానికి సిమెంట్ రోడ్డు నిర్మిస్తుండటం ఆనందదాయకమన్నారు. మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు వేగి గోపీకృష్ణ, డీసీసీబీ మాజీ డైరెక్టర్ సిదిరెడ్డి శ్రీనివాసరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు దాడి నాగరాజు, వేగి రామకోటేశ్వరరావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

### ఘనంగా కృష్ణాష్టమి వేడుక



తాళ్లపాలెం గాయిత్రి స్కూలులో కృష్ణుడు, గోపిక వేషధారణలో బాల బాలికలు

కశింకోట: మండలంలోని గాయిత్రి స్కూలులో శుక్రవారం ముందస్తుగా కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాల బాలికలు కృష్ణుడు, గోపికల వేషధారణలతో అలరించారు. ఉట్టి కొట్టి, కోలాటాలు ప్రదర్శించి ఆహూతులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు లగిశెట్టి గణేష్, బీజేపీ నాయకుడు గల్లా రాజు, కరస్పాండెంట్ బి. రామకుమార్, హెచ్ఎం వై. నగేష్, రిటైర్డు ఉపాధ్యాయుడు జి. సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### అనకాపల్లి సినిమాలు

| | |
|---|---|
| రాజా | :వార్ 2 |
| సత్యనారాయణ స్క్రీన్-1 | :వార్ 2 |
| సత్యనారాయణ స్క్రీన్-2 | :కింగ్ డమ్ |
| పర్తిసాయి | :మహావతార్ నరసింహం |
| షిర్డిసాయి | :కూలీ |
| వెంకటేశ్వర | :హరిహర వీరమల్లు |
| శ్రీ సత్య | :సోమేశ్వర సులోచన |
| రామచంద్ర | :వార్ -2 |

### రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 28 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5, బీ పాజిటివ్-7, ఓ పాజిటివ్-12, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్త నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యూ లోకేష్(9703613706)ను సంప్రదించవచ్చు.

### గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 211 మంది గ్యాస్‌బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 158 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

# మురిసిన మువ్వన్నెల జెండా

## ఘనంగా 79వ స్వాతంత్ర్య దినోత్సవం • ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

అనకాపల్లి: వాడవాడలా 79వ స్వాతంత్ర్య వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యా సంస్థల్లో జాతీయ జెండాను ఆవిష్కరించి దేశభక్తిని చాటుకున్నారు. స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం కార్యాలయంలో ఏడీఆర్ సీహెచ్.ముకుందరావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పరిశోధనా స్థానంలో ప్రగతిని, నూతన వంగడాలను, విత్తనోత్పత్తి గురించి వివరించారు. అనంతరం పాలిటెక్నిక్ కళాశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన పది మంది విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేసి సత్కరించారు. కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్తలు పి.వి.కె.జగన్నాథరావు, రమణమూర్తి, ఉమామహేశ్వరరావు, శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

**ఎంపీడీవో కార్యాలయంలో..**

ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ బ్రిటీష్ కబంధ హస్తాల నుంచి దేశానికి స్వాతంత్ర్యం సాధించిన మహనీయుల త్యాగాలను మరువరాదన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో డి.రాము, ఈవోపీఆర్డీ ప్రసాద్, కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**హ్యాపీ కిడ్స్ స్కూల్‌లో..**

స్థానిక ఉడ్‌పేట హ్యాపీ కిడ్స్ స్కూల్‌లో జాతీయ జెండాను స్కూల్ కరస్పాండెంట్ శెట్టి గిరీష్‌కుమార్ ఆవిష్కరించారు. చిట్టిపొట్టి చిన్నారులు దేశ నాయకుల వేషధారణలో అలరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**సీపీఎం కార్యాలయంలో..**



ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఏడీఆర్ ముకుందరావు

సీపీఎం జోనల్ కార్యదర్శి తాకాసి వెంకటేశ్వరరావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**ఎంపీ కార్యాలయంలో...**

జాతీయ రహదారిలోని ఎంపీ కార్యాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ శ్రేణులకు మిఠాయిలు పంచిపెట్టారు.

**కనకదుర్గమ్మ ఆలయం వద్ద..**

మండలంలో సత్యనారాయణపురం పంచాయతీ కనకదుర్గమ్మ ఆలయం కొండపైన భరతమాత విగ్రహానికి ఆలయ అధ్యక్షుడు యడ్ల త్రినాథ్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో...**

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు పాత్రపల్లి వీరుయాదవ్ ఆధ్వర్యంలో త్రిచక్ర వాహనంపై పట్టణంలో జాతీయ జెండాలను చేతబట్టి ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**సీపీఎం కార్యలయంలో...**

స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ సీనియర్ నాయకుడు గండి నాయినబాబు జాతీయ జెండాను ఆవిష్కరించారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఆర్డీవో, తహసీల్దార్, పట్టణ, రూరల్, ట్రాఫిక్, దిశ పోలీస్ స్టేషన్లు, జీవీఎంసీ, పంచాయతీరాజ్, వ్యవసాయ శాఖ, ఎక్సైజ్, అగ్నిమాపకశాఖ, విద్యుత్ శాఖ కార్యాలయాలు, ఎన్టీఆర్ వైద్యాలయంలో అధికారులు జాతీయ జెండాను ఆవిష్కరించారు.



ఎంపీడీవో కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

**కశింకోట మండలంలో**

కశింకోట: వాడవాడలా స్వాతంత్ర్య దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కశింకోట ఎంపీడీవో కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఎంపీపీ కలగా లక్ష్మి జాతీయ జెండాను ఎగుర వేసి గౌరవ వందనం చేశారు. ఎంపీడీవో ధర్మారావు, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, సర్పంచ్ మంత్రి జయరజని, ఉగ్గినపాలెం సర్పంచ్ కలగ గున్నయ్యనాయుడు, పీహెచ్‌సీ వైద్యాధికారులు తిరుపతిరావు, యశోద, ఆర్‌ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ వేగి గోపీకృష్ణ, డీసీసీబీ మాజీ డైరెక్టర్ సిదిరెడ్డి శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ సి.హెచ్.తిరుమలరావు, పోలీసు స్టేషన్‌లో సీఐ అల్లు స్వామినాయుడు జెండా ఆవిష్కరించారు. ఎస్ఐలు లక్ష్మణరావు, మనోజ్‌కుమార్, పోలీసులు గౌరవ వందనం చేశారు. పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ మంత్రి జయరజని జెండా ఎగుర వేశారు. టీపీఎస్ జెడ్పీ హైస్కూలు, బాలికల హైస్కూళ్లలో విద్యార్థులు పలు విన్యాసాలు, థింసా నృత్యం నిర్వహించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమాల్లో హెచ్ఎంలు ప్రసాద్, ఎంఎస్ స్వర్ణకుమారి, విద్యా కమిటీ చైర్మన్లు నక్కా నాగమణి, ఆళ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు. కశింకోటలోని ఏపీఈపీడీసీఎల్ డివిజన్ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె. రామకృష్ణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఇక్కడి ఆర్‌ఈసీఎస్ సెక్షన్ కార్యాలయంలో ఏఈ బుద్ధ ప్రసాద్ జెండా ఆవిష్కరించారు. ఇంజనీరింగ్, సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక సెయింట్ జాన్స్ స్కూలులో జెండాను కెనాన్ జాన్ ఆవిష్కరించారు. విద్యార్థులు దేశ నాయకుల వేషధారణలో అలరించారు. బాలికలు నృత్యాలు, బాలురు విన్యాసాలు చేసి ఆహూతులను ఆకట్టుకున్నారు. స్థానిక సత్యనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో రిటైర్డు ఎంఈవో నంబా రమణ జెండా ఆవిష్కరించగా, కార్యకర్త తనూజ, తదితరులు పాల్గొన్నారు.



జోనల్ కార్యాలయం వద్ద గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న కమిషనర్ చక్రవర్తి



విభిన్న ప్రతిభావంతులు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దివ్యాంగులు



ఉడ్‌పేట హ్యాపీ కిడ్స్ పాఠశాలలో దేశనేతల వేషధారణలో చిన్నారులు



రూరల్ పోలీస్ స్టేషన్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించిన సీఐ అశోక్‌కుమార్



సీపీఐ కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరిస్తున్న పార్టీ జోనల్ కార్యదర్శి ఉమామహేశ్వరరావు

**తాళ్లపాలెంలో...**

తాళ్లపాలెం పీహెచ్‌సీలో ఎంపీపీ కలగా లక్ష్మి జెండా ఎగుర వేశారు. వైద్యాధికారి ఎ. మనీషా, ఎంపీటీసీ సభ్యురాలు లగిశెట్టి భవాని, ఆరోగ్య విస్తరణాధికారి బి.ఎ. సుబ్బారావు, డీహెచ్ఈవో ఎం.ఎస్.వి. ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు. బయ్యవరంలో సన్ని తాళ్లపాలెం కూడలిలో విజయలక్ష్మి ఆటో యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో సీఐ అల్లు స్వామినాయుడు జెండా ఎగుర వేశారు. యూనియన్ నాయకులు పి. నాగేశ్వరరావు, కె. లోవరాజు, తదితరులు పాల్గొన్నారు. గాయత్రి స్కూలు, ఏపీ బాలికల గురుకుల పాఠశాల, హైస్కూళ్లలో స్వాతంత్ర్య దినోత్సవం నిర్వహించారు.

**వాలీబాల్ పోటీల విజేతలకు బహుమతులు..**

సన్నీ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో యువకులకు వాలీబాల్ పోటీలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ బహుమతులు వరుసగా రూ.4 వేలు, రూ.3 వేలు వంతున అందజేశారు. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు జనపరెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



బయ్యవరంలో సన్నీ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీ విజేతలకు బహుమతుల అందజేత



ఎన్టీఆర్ ఆస్పత్రిలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న సూపరింటెండెంట్ కృష్ణారావు



కశింకోట ఆర్‌ఈసీఎస్ సెక్షన్ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరిస్తున్న ఏఈ బుద్ధ ప్రసాద్



కశింకోట పంచాయతీ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరణ



హోంమంత్రి వంగలపూడి అనిత నుంచి అవార్డు స్వీకరిస్తున్న ఆత్మ ఏటీఎం రామకృష్ణ



సీపీఎం కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న గండి నాయనబాబు



సత్యనారాయణపురంలో భరతమాత విగ్రహానికి నివాళులర్పించిన యడ్ల త్రినాథ్, తదితరులు



బీజేపీ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు



కశింకోట డీపీఎన్ జెడ్పీ హైస్కూలులో పిరమిడ్ విన్యాసం



కశింకోట డీపీఎన్ జెడ్పీ హైస్కూలులో విద్యార్థుల విన్యాసాలు



కశింకోట మండల పరిషత్ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరిస్తున్న ఎంపీపీ కలగా లక్ష్మి



కశింకోట తహసీల్దార్ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించిన తహసీల్దార్ తిరుమలరావు



కశింకోట పోలీసు స్టేషన్‌లో గౌరవ వందనం చేస్తున్న సీఐ అల్లు స్వామినాయుడు, సిబ్బంది



ఆటో యూనియన్ ఆధ్వర్యంలో తాళ్లపాలెంలో జెండా ఆవిష్కరిస్తున్న సీఐ స్వామినాయుడు

## ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సాహకాలు



విద్యార్థులను సత్కరించిన సైన్స్ ఉపాధ్యాయుడు సత్తిబాబు



చెక్కులు పంపిణీ చేస్తున్న స్కూల్ కమిటీ చైర్మన్ కొత్ని సముద్రాలు

అనకాపల్లి: విద్యార్థి దశ నుంచి ఇష్టపడి చదువుకోవడం వల్ల ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని సైన్స్ ఉపాధ్యాయుడు జంధ్యాల సత్తిబాబు తెలిపారు. శుక్రవారం స్థానిక మెయిన్‌రోడ్డు జీవీఎంసీ పెద్ద హైస్కూల్ ఆవరణలో 2024-25 పదో తరగతిలో 500 మార్కులు దాటిన 11 మంది విద్యార్థులకు తమ సొంత నిధులతో ప్రోత్సాహకాలు అందించి శాలువాతో సత్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థుల్లో ఉపాధ్యాయులు నైపుణ్యాన్ని వెలికితీయాలన్నారు. 90 సంవత్సరాల హైస్కూల్ చరిత్రలో ఎం.వైభవ్ శ్యామ్ కుమార్ 586 మార్కులు సాధించాడన్నారు. ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందన్నారు. సదరు విద్యార్థికి రూ.5 వేలు, మిగిలిన విద్యార్థులు పి.యశ్వంత్, జి.వెంకట్ సాయికుమార్, కె.బెన్నీ, జి.హిమశేఖర్, సీహెచ్.ఆశాబాల వర్ధన్, కె.ప్రదీప్, జి.శ్యామ్‌శంకర్ బుచ్చిరాజు, ఎం.బాలాజీ, డి.బంగారులక్ష్మీ, వి.వసుందరలకు రూ.వెయ్యి నగదు ఇచ్చారు. తెలుగులో వంద మార్కులు వచ్చిన విద్యార్థికి తెలుగు ఉపాధ్యాయిని భారతీదేవి రూ.వెయ్యి అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం బ్రహ్మజీ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తుమ్మపాల: మండలంలో మార్టూరు జెడ్పీ పాఠశాలలో శుక్రవారం స్వాతంత్ర్య వేడుకల్లో తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ కోట్ని సముద్రాలు (ఆటో బాబూరావు) పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు రూ.10 వేల చొప్పున అందించారు. 2024-25 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 500 మార్కులు పైన సాధించిన ఆరుగురు విద్యార్థులు కరణం భాను-550 మార్కులు, పెద్దాడ లిఖిత-544, సిహెచ్.అనుషా దుర్గా-537, కరణం శరణ్య-531, డి.హేమశ్రీ-521, టి.వసంతి-500 లకు సర్పంచ్ కరణం రెవెన్యూ నాయుడు, కూటమి నాయకులతో కలిసి ప్రోత్సాహకాలు అందించారు. పాఠశాలలో రూ.25 వేలతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ఆదర్శంగా నిలిచారు. కార్యక్రమంలో హెచ్ఎం.విజయ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం



కశింకోటలోని కనకమహాలక్ష్మి ఆలయంలో కుంకుమార్చన చేస్తున్న అర్చకుడు కృష్ణ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



గవరపాలెం నిదానందొడ్డి సంతోషిమాత అమ్మవారు

అనకాపల్లి: ఊరూవాడా వరలక్ష్మీదేవి వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నాలుగో శ్రావణ శుక్రవారం సందర్భంగా భక్తులు తమ శక్తిమేరకు లక్ష్మీదేవిని పూజించారు. అమ్మవారి ఆలయాలకు చేరుకుని ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. గవరపాలెం సతకంపట్టు కనకదుర్గ, గవరపాలెం నిదానందొడ్డి రహదారిలో సంతోషిమాత, కామాక్షిదేవి, మెయిన్‌రోడ్డు కన్యకాపరమేశ్వరి, సత్యనారాయణపురం కనకదుర్గ కొండంపై అమ్మవారిని అలంకరించారు. భక్తులు ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం సత్యనారాయణపురం కనకదుర్గమ్మ కొండపై అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కశింకోట: స్థానిక కనకమహాలక్ష్మి ఆలయంలో నాల్గో శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. అర్చకుడు వి.కృష్ణ ఆధ్వర్యంలో అమ్మవారిని నూతన వస్త్రాలు, ఆభరణాలు, పూలమాలలతో అలంకరించి పూజలు చేశారు. సర్వమంగళాంబ సమేత త్రిపురాంతకస్వామి ఆలయం (శివాలయం)లో సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారిని అందంగా అలంకరించి పూజలు చేశారు. అర్చకులు వి. చిదంబరం, కృష్ణల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక గవరపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు లలితా సహస్ర నామ పారాయణం నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాస్ పూజా కార్యక్రమాలు జరిపారు. మహిళలు భక్తి గీతాలతో భజన చేశారు.